క్లుప్తంగా

గట్టు మల్లన్న సన్నిధిలో గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో భక్తులు

జైపూర్: మండలంలోని వేలాల గట్టు మల్లన్న స్వామి సన్నిధిలో గురువారం గిరి ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సురేశ్ ఆత్మారాం మహరాజ్ ఆధ్వర్యంలో గుట్టపై నిర్వహించిన గిరిప్రదక్షిణకు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. గట్టుపై స్వయంభూగా వెలిసిన మల్లన్న స్వామి గుట్టపై గిరిప్రదక్షిణ చేసి దొనిలో వెలిసిన మల్లన్న స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

'పోరాట యోధుడు మునీర్'

పాతమంచిర్యాల: సీనియర్ జర్నలిస్టు మునీర్ తెలంగాణ రాష్ట్ర పోరాట యోధుడని అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఐబీ చౌరస్తాలో సింగరేణి రిటైర్డ్ కార్మికుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మునీర్ సంస్మరణ సభకు ఆయన హాజరయ్యారు. మునీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గని కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం పోరాటం చేశారని కొనియాడారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. డీటీవో సంతోష్‌కుమార్, సింగరేణి రిటైర్డ్ కార్మికులు యాదిరెడ్డి, వెంకట్రాజం, బార్ అసోసియేషన్ నాయకులు సందాని, కర్రె లచ్చన్న, మొహినుద్దీన్, శ్రీనివాస్, జలాలుద్దీన్ తాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతికి సంతాపం



తాండూర్: మౌనం పాటిస్తున్న అధికారులు

నెన్నెల/వేమనపల్లి/తాండూర్/భీమారం: గుండెపోటుతో మృతిచెందిన జన్నారం మండలం ఇందన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి చంద్రమౌళికి అధికారులు నివాళులర్పించారు. నెన్నెల, తాండూర్, భీమారం, వేమనపల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో గురువారం ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన చిత్రపటం వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీడీవోలు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఎంపీవోలు శ్రీనివాస్, అనిల్, సతీశ్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

జైపూర్/చెన్నూర్‌రూరల్: ప్రభుత్వ బడులను కాపాడుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ పాఠశాలల్లో చేర్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, ప్రధాన కార్యదర్శి రాజావేణు పేర్కొన్నారు. జైపూర్ మండలం ఇందారం, టేకుమట్ల, షెట్‌పల్లి. కుందారం, కిష్టాపూర్, వేలాల, పొనూర్, శివ్వారం, చెన్నూర్ మండలం కిష్టంపేట, ఆస్నాద, సోమనపల్లి,నాగాపూర్, చింతలపల్లి, చెన్నూర్, సుబ్బరాంపల్లి, కత్తెరసాల, అంగ్రాజ్‌పల్లి, ఎల్లక్కపేట గ్రామాల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాట తదితర సౌకర్యాలు అందిస్తారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, కార్యదర్శి సంతోశ్‌కుమార్, శివానంద్, పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో నాయకులు

పాతమంచిర్యాల: టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 30 మంది పెరిక విద్యార్థులను జిల్లా కేంద్రంలోని శిశుమందిర్‌లో పెరిక ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు గురువారం సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు పెట్టెం తిరుపతి, ప్రధాన కార్యదర్శి అంకతి తిరుపతి, కార్యవర్గ సభ్యులు తోట మల్లేశ్, గోళ్ల రామన్న, ప్రముఖ వైద్యుడు పి.రమణ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

బెల్లంపల్లి: పట్టణంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కాపాడాలని సీపీఐ నాయకులు కోరారు. గురువారం నూతన తహసీల్దార్ బాధ్యతలు చేపట్టిన ఎల్.కృష్ణను తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానం చేశారు. పట్టణ, మండల కార్యదర్శులు ఆడెపు రాజమౌళి, బొంతల లక్ష్మీనారాయణ, సహాయకార్యదర్శి బి.తిలక్ అంబేద్కర్, నాయకులు మేకల రాజేశం, బొంకూరి రాంచందర్, స్వామిదాస్ పాల్గొన్నారు.

మూగజీవాలకు షాక్

- మృత్యుపాశాలుగా కరెంటు తీగలు
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో కాడెడ్లు, గేదెలు మృత్యువాత
- నెల రోజుల వ్యవధిలో 14 మృతి



కన్నెపల్లి మండలం మెట్‌పల్లి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్ షాక్ తగిలి మృతిచెందిన కాడెద్దు

మంచిర్యాలఅగ్రికల్చర్: వ్యవసాయంలో రైతులకు అండగా నిలిచే కాడెడ్లు, పాడిపశువులు, గేదెలు విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మృత్యువాత పడుతున్నాయి. విద్యుత్ తీగలు తెగిపడి, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తీగలు తగిలి చనిపోతున్నాయి. రైతు కుటుంబాలు పాడి పశువులు, ఎడ్లను కుటుంబ సభ్యుల్లా చూసుకుంటాయి. గతనెల రోజుల వ్యవధిలో మందమర్రి, దండేపల్లి, బెల్లంపల్లి, కన్నెపల్లి, తాండూర్, భీమిని, నెన్నెల, చెన్నూర్ మండలాల్లోని గ్రామాల్లో విద్యుదాఘాతంతో 14 ఆవులు, గేదెలు, కాడెద్దులు చనిపోయాయి. కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఎర్త్ వైర్లకు విద్యుత్ సరఫరా, వంగిన స్తంభాలు, చేతికందేలా కరెంటు వైర్లు తదితర లోపాల వల్ల మృత్యుపాశాలుగా మారుతున్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో పంటపొలాలు, రహదారులపై విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. 11కేవీ విద్యుత్ వైర్లు తెగిపడి రోజులు గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. సిబ్బంది కొరత కారణంగా చాలా ప్రాంతాల్లో లైన్‌మెన్‌లు అందుబాటులో ఉండడం లేదు. ఒకవేళ సిబ్బంది ఉన్నా సకాలంలో మరమ్మతు చేయడం లేదు. వ్యవసాయ భూముల్లో పెద్ద పెద్ద చెట్లు ఉండడం సర్వసాధారణం. చాలాచోట్ల విద్యుత్ తీగలకు తగలడంతో స్పార్క్‌లు వచ్చి తీగలు బలహీనంగా మారుతుంటాయి. కొన్నిసార్లు చెట్ల కొమ్మలు విరిగి తీగలపై పడడంతో నేలపై పడి ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. విద్యుత్ అధికారులు వర్షాకాలం ఆరంభంలో విద్యుత్ తీగలకు తగిలే అవకాశం ఉన్నచోట్ల చెట్ల కొమ్మలను కొట్టేస్తారు. ఆ తర్వాత ఏదైనా ప్రమాదం జరిగితే.. విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడితే తప్ప వాటి గురించి పట్టించుకోవడం లేదు.

పరిహారం అందించాలి



11కేవీ లైన్ విద్యుత్ వైర్లు తెగి పొలంలో పడడంతో మేతకు వెళ్లిన నా రెండు గేదెలు షాక్‌తో చనిపోయాయి. రూ.1.40 లక్షలు విలువైన పాడి గేదెలు మృతితో తీవ్రంగా నష్టపోయాను. కరెంటోళ్లు పట్టించుకోకపోవడం వల్లే గేదెలు చనిపోయాయి. పరిహారం అందించి ఆదుకోవాలి.

– జక్కుల రాజన్న, గ్రామం: నార్వాయిపేట, మం: నెన్నెల

చెప్పినా పట్టించుకోలేదు

గత కొన్నిరోజుల నుంచి ఇనుప స్తంభానికి విద్యుత్ సరఫరా జరుగుతుందని సిబ్బందికి పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు. ఆవు స్తంభానికి తగిలి విద్యుత్ షాక్‌తో చనిపోయింది. రూ.50 వేలు విలువైన ఆవు మృతితో ఆర్థికంగా నష్టం జరిగింది. పాలు ఇచ్చే తల్లి లేక లేగదూడ తల్లడిల్లుతోంది.

– గొల్ల తిరుపతి, గ్రామం: త్యాళ్లపేట, మం: దండేపల్లి

కాసిపేట సంక్షేమ గురుకులానికి నగదు బహుమతి



చెక్కు అందుకుంటున్న ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

బెల్లంపల్లి: టెన్త్, ఇంటర్ వార్షికఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల పాఠశాల/కళాశాలకు ప్రభుత్వం నగదు బహుమతి అందజేసింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బాబూ జగ్జీవన్‌రాం భవన్‌లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్ రూ.5 లక్షల చెక్కు, ప్రశంసాపత్రం అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 239 సంక్షేమ గురుకులాల్లో 14 గురుకులాలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. వీటిలో కాసిపేట బాలుర గురుకుల పాఠశాల /కళాశాల ఒకటి కావడం గమనార్హం. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి, కాళేశ్వరం జోన్–1 అధికారి అరుణకుమారి ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను అభినందించారు.

మంచిర్యాల అభివృద్ధికి సహకరిస్తాం

- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్



మాట్లాడుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల అభివృద్ధికి సహకరిస్తామని, ఎమ్మెల్యే, ఎంపీలు కలిసి ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) తీసుకువస్తే కేంద్రం నుంచి అవసరమైన నిధులు తీసుకువచ్చే బాధ్యత తమదని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంచిర్యాల, అంతర్గాం బ్రిడ్జికి కేంద్రప్రభుత్వం 90 శాతం నిధులను కేంద్రం నుంచి తీసుకురావాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఇటీవల పేర్కొన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి డీపీఆర్ తయారు చేసి కేంద్రమంత్రిత్వ శాఖకు పంపిస్తే, పరిశీలించి నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యేకు తెలియకపోవడం విడ్డూరమన్నారు. ఎమ్మెల్యే వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తన కుటుంబంలో ఎవరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించారో నిరూపించాలని సవాల్ విసిరారు. మంచిర్యాల, అంతర్గాంల మధ్య గోదావరి నదిపై బ్రిడ్జిని నిర్మించకపోవడానికి అసలు కారకుడు దివాకర్‌రావేనని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పురుషోత్తం, అశోక్, వెంకటకృష్ణ, కృష్ణమూర్తి, గురువయ్య, ప్రభాకర్, సతీశ్‌రావు, మధు, లచ్చన్న, శ్రీదేవి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్సెట్టిపేట: రాబోయే ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని అని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. మండలంలో సీసీరోడ్లు, విద్యుత్ దీపాలు, 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనం, గ్రామాలను కలిపేందుకు బీటీ రోడ్లు వేయించామన్నారు. పట్టణ, పల్లె ప్రగతి కోసం నిధులు కేటాయించి అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రస్తుత పాలనపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. విద్యుత్ కోతలతో పాలన గాడి తప్పిందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, యువజన నాయకుడు విజిత్‌రావు, పట్టణ అధ్యక్షులు పాదం శ్రీనివాస్, చుంచు చిన్నయ్య, నాయకులు తిప్పని లింగయ్య, శ్రీనివాస రెడ్డి, చాతరాజు రాజన్న, పాల్గొన్నారు.

ప్రతీనెల మూడో తేదీలోపు వేతనాలు ఇవ్వాలి



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతీనెల మూడో తేదీలోపు వేతనాలు అందించాలని జిల్లా మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ రెండు నెలలుగా వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నామని, సకాలంలో అందించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ జమ కాకపోవడంతో నష్టపోతున్నామన్నారు. వయస్సు పైబడిన వారి స్థానంలో పిల్లలను తీసుకోవాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, అధ్యక్షుడు గోవర్ల ఆశయ్య, ఆత్మకూరి తిరుపతి, ఆవునూరి లింగయ్య, చిప్పకుర్తి లింగయ్య, ఆవునూరి రాజేశం, ఆవుల శ్రీనివాస్, అవునూరి సుధాకర్, సత్తయ్య, చిప్పకుర్తి రాకేశ్, చిప్పకుర్తి రాజేందర్ పాల్గొన్నారు.

సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జన్నారం: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ కృషితోనే ఖానాపూర్ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజఫర్ అలీఖాన్ ఆధ్వర్యంలో జన్నారంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణతో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్లలో విద్యా వ్యవస్థను పట్టించుకోలేదని ఆరోపించారు. పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లల చదువులు దృష్టిలో పెట్టుకుని ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మాణిక్యం, నాయకులు ఇసాక్, రమేశ్, ఇందయ్య, సతీశ్, రాజన్న, స్వామి రాజేశ్వర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, యూత్ కాంగ్రెస్ నాయకులు షాకీర్, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి భూభారతి సదస్సులు

తాండూర్: జిల్లావ్యాప్తంగా జూన్ 3 నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. తాండూర్ మండలంలోని 3న పెగడపల్లి, ద్వారకాపూర్, 4న రేపల్లెవాడ, కాసిపేట, 5న కత్తెర్ల, అన్నారం, 6న బల్‌హన్‌పూర్, రాంపూర్, 9న బోయపల్లి, అబ్బాపూర్, 10న నర్సాపూర్, మదనాపూర్, 11న గోపాల్‌నగర్, కొత్తపల్లి, 12న మాదారం, చంద్రపల్లి, 13న వెంకాయపల్లి, గంపలపల్లి, 16న రేచిని, చౌటపల్లి, 17న కిష్టంపేట, అచ్చులాపూర్, 18న అంకెపల్లి, తాండూర్‌లో సదస్సులు ఉంటాయని తహసీల్దార్ యు.జ్యోత్స్న తెలిపారు. రైతులు భూ సమస్యలపై ఆయా గ్రామాల వారీగా జరిగే సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జన్నారం: జూన్ 3న రాంపూర్, రేండ్లగూడ, 4న వెంకటపూర్, నర్సింగాపూర్, తిమ్మాపూర్, 5న సింగరాయిపేట్, కొత్తపేట్, 6న మురిమడుగు, తపాలపూర్, 9న చింతగూడ, పాపమ్మగూడ, ఇందన్‌పల్లి, 10న రోటిగూడ, మొర్రిగూడ, 11న కలమడుగు, జన్నారం, 12న పుట్టిగూడ, పొనకల్, కామన్‌పల్లి, టీజీపల్లి, 13న కిష్టాపూర్, జువ్విగూడ, 16న దొంగపల్లి, లోత్రే, దేవునిగూడ, 17న కవ్వాల్, హాస్టల్ తండా, బంగారుతండా, మల్యాల్, 18న పైడిపెల్లి, ధర్మారం, 19న బాదంపల్లి, చింతలపల్లి, భొమ్మెన గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి కోరారు.

నెన్నెల/వేమనపల్లి: జూన్ 3 నుంచి జూన్ 20 వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్లు మహేందర్‌నాథ్, సంధ్యారాణి తెలిపారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ సంతోష్‌కుమార్

నస్పూర్: తహసీల్దార్‌గా ఎస్.సంతోష్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ కలెక్టరేట్‌లోని ఇ సెక్షన్‌లో సూపర్‌వైజర్‌గా బదిలీపై వెళ్లారు. కలెక్టరేట్‌లోని సీ సెక్షన్‌లో సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో జూన్ 3 నుంచి 11 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3న ఆర్‌అండ్‌ఆర్ తాళ్లపల్లి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో, తీగల్‌పహడ్ పాత గ్రామపంచాయతీ కార్యాలయంలో, 4న తీగల్ పహడ్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం, 5,6,9 తేదీల్లో విలేజ్ నస్పూర్‌లోని పాత మున్సిపల్ కార్యాలయం, 10, 11న సీతారాంపల్లి రైతు వేదిక వద్ద, సింగాపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ప్రైమరీ పాఠశాలలో ఈ సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు. అంతకుముందు తహసీల్దార్‌ని టీఎన్జీవో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. టీఎన్జీఓస్ హౌసింగ్ సొసైటీలోని పలు సమస్యలపై తహసీల్దార్‌తో చర్చించామని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీహరి, రామ్మోహన్ తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య ఉన్నారు.

తహసీల్దార్ బదిలీ ఉత్తర్వులు మారాయి

- సంతోష్‌కుమార్‌కు బదులు రోహిత్
- ముందే చెప్పిన సాక్షి..

దండేపల్లి: దండేపల్లి తహసీల్దార్ బదిలీపై నెలకొన్న చర్చపై 'సాక్షి'లో వచ్చిన కథనం నిజమైంది. తహసీల్దార్ సంధ్యారాణిని వేమనపల్లికి, కలెక్టరేట్ కార్యాలయ సీ–సెక్షన్ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్‌ను దండేపల్లికి బదిలీ చేస్తూ కలెక్టర్ కుమార్ దీపక్ ఈనెల 19న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సంతోష్‌కుమార్ వారం గడిచినా అక్కడ రిలీవ్ కాకుండా, ఇక్కడ చేరలేదు. ఈ విషయమై 'సాక్షి'లో ఈనెల 25న 'అక్కడ రిలీవ్ కాలేదు..ఇక్కడ చేరలేదు'అనే కథనం ప్రచురితమైంది. ఇక్కడ చేరకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తం కావడంతోపాటు పలువురు పలు విధాలుగా చర్చించుకున్నారు. సంతోష్‌కుమార్‌కు దండేపల్లికి రావడం ఇష్టం లేదన్నట్లు తెలిసింది. పైగా ఆయనకు బదులు మరొకరు వస్తారు అనే వార్తలు కూడా వినిపించాయి. తహసీల్దార్ బదిలీ ఉత్తర్వులు మారనున్నట్లు వినిపించిన వార్తలు కూడా ఎట్టకేలకు వాస్తవమే అయ్యాయి. సంతోష్‌కుమార్ ఇక్కడ విధుల్లో చేరకముందే, నస్పూర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి వచ్చిన రోహిత్‌ను దండేపల్లికి బదిలీ చేస్తూ కలెక్టర్ కుమార్ దీపక్ తాజాగా ఈనెల 28న మరో బదిలీ ఆర్డర్ జారీచేశారు. బదిలీ వెనక ఏమైన రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా లేదా తాజా, గత తహసీల్దార్ల విజ్ఞప్తుల మేరకు బదిలీల్లో మార్పు జరిగిందా తెలియడం లేదు.

సంక్షిప్త వార్తలు

నేడు ఎమ్మెల్యే పర్యటన

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శుక్రవారం పర్యటించనున్నారు. జైపూర్, భీమారంలో కార్యకర్తల సమావేశం, చెన్నూర్‌లో బస్తీ ప్రారంభోత్సం, మధ్యాహ్నం క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్, మండలంలోని కార్యకర్తల సమావేశం, సాయంత్రం జైపూర్ మండలం షెట్‌పల్లి, శివ్వారం, కిష్టాపూర్, వేలాల, పొనూర్, కుందారం, నర్సింగాపూర్, బెజ్జల గ్రామాలకు చెందిన ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేస్తారు. అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నైపుణ్యశిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ ఐటీఐ మంచిర్యాలలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0లో భాగంగా నైపుణ్య శిక్షణ కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్, సోలార్ ఎల్ఈడీ సొల్యూషన్స్, అసోసియేట్ డేటాఎంట్రీ ఆపరేటర్, ట్రైనీ, బ్యూటీషన్, వెల్డర్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు అభ్యర్థులు ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సాంఘిక సంక్షేమ గురుకుల,బాలికల కళాశాలల్లో చదువుకుని ఉద్యోగం పొందలేని పూర్వవిద్యార్థులకు యూఎస్ఎక్స్‌టీ సంస్థ ఆధ్వర్యంలో 30 రోజుల నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ముల్కల్ల గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ కె.మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలో చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న 18 నుంచి 25 ఏళ్ల వయస్సు గల వారు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 30లోగా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

నూతన కార్యవర్గం

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం, హాజీపూర్ మండలాల కేబుల్ టీవీ ఆపరేటర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు మణికుమార్ ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా రాజమల్లు, ఉపాధ్యక్షుడిగా రాజన్న, ప్రధాన కార్యదర్శిగా కుమారస్వామి, సంయుక్త కార్యదర్శులుగా యాదగిరి సత్యం, మారుతి, కోశాధికారిగా బుచ్చగౌడ్, ప్రచార కార్యదర్శిగా తిరుపతి, సలహాదారులుగా రాజయ్య, దామోదర్, సాగర్ ఎన్నికయ్యారు.

ఎంహెచ్‌డీ చిత్తాపూర్ కార్యవర్గం

నెన్నెల: మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) చిత్తాపూర్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడి రాజం, ఉపాధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా శంకర్, కార్యదర్శిగా రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీకాంత్, నవీన్, సమ్మయ్య, సంపత్‌లను కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

భీమిని: జగ్గయ్యపేటలో గురువారం శివకేశవ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ప్రారంభమైంది. వేదపండితుడు శ్యాంప్రణీత్‌శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులు పూజలు నిర్వహించనున్నారు.

పోలీసు కళాబృందం ప్రదర్శన

నెన్నెల: కొత్తగూడంలో గురువారం రాత్రి పోలీసు కళాబృందం వివిధఅంశాలపై ప్రజలకు అవగాహన కల్పించింది. సైబర్ నేరాలు, బాల్య వివాహాల గురించి ఆటపాటల రూపంలో వివరించారు. మాజీ సర్పంచ్ సుజాత, నాయకులు శ్రీనివాస్ ఉన్నారు.

రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ

బెల్లంపల్లి: హైదరాబాద్ జలవిహార్‌లో ఈనెల 31న జరగనున్న టీయూడబ్ల్యూజే–143 జర్నలిస్ట్ యూనియన్ రజతోత్సవసభ పోస్టర్లను బెల్లంపల్లిలోని ఏఎంసీ ఏరియాలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో సంఘం నాయకులు గురువారం ఆవిష్కరించారు. జర్నలిస్టులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగులకు యోగా శిక్షణ

చెన్నూర్: అంతర్జాయ యోగా దినోత్సవ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు, చిన్నారులకు యోగా శిక్షణ ఇచ్చినట్లు యోగా మాస్టర్లు మధుకర్, రజిత తెలిపారు. జూన్ 22న అంతర్జాతీయ యోగా దినోత్సవం నాటికి ప్రతి ఒక్కరికి యోగా శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా తరగతులను నిర్వహిస్తామన్నారు.

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో యోగా శిక్షకులు రజిత, చుక్కయ్య గురువారం యోగాసనాలు వేశారు. ఆయుర్వేద వైద్యుడు సంజయ్‌కుమార్, ఎంఎస్‌వో విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల రద్దీ

వేమనపల్లి: తోగు వెంకటపురానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. ప్రాణహిత నది ఒడ్డున తెల్లమద్ది చెట్టు తొర్రలో కొలువైన వేంకటేశ్వరుడిని దర్శించుకోవడానికి మహారాష్ట్ర, తెలంగాణ నుంచి భక్తులు తరలివస్తున్నారు. అక్కడే ఉన్న సప్త జలగుండాల వద్ద స్నానం చేసి నది ఒడ్డున వెంకటేశ్వరుడికి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

గొల్లకుర్మల ఆర్థికాభివృద్ధికి పాటుపడాలి



ఆర్.కృష్ణయ్యకు వినతిపత్రం ఇస్తున్న అశోక్

భీమారం: రాష్ట్రంలో గొల్లకుర్మల ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లో జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలకు పశుగ్రాసం అందించేందుకు అటవీప్రాంతాలకు వెళ్లే అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు. అడవుల పెంపకం పేరుతో చుట్టూ కందకాలు తవ్వడం ఇబ్బందిగా మారిందన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వంతో మాట్లాడి అడవుల్లో పశుగ్రాసం కొంత భూమిని కేటాయించాలని కోరారు. నాయకులు కుమార్ యాదవ్, శ్రీనివాస్, అన్వేష్, సాయికుమార్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

జీఎంను కలిసిన మాదిగ ఉద్యోగులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాసులను ఆయన చాంబర్‌లో సింగరేణి మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆయనకు ఉద్యోగుల సమస్యలను వివరించారు. వర్గీకరణలో భాగంగా మాదిగ ఉద్యోగులకు కంపెనీలో దక్కాల్సిన ప్రమోషన్లు, ఇతర హక్కులు కల్పించాలన్నారు. రాజేంద్రప్రసాద్, కుమార్, మహేందర్, శ్రీనివాస్, విష్ణు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో సింగరేణికి సీట్లు

శ్రీరాంపూర్: మంథనిలోని జేఎన్‌టీయూలో బీటెక్ కోర్సుల్లో చేరడానికి సింగరేణి ఉద్యోగుల, అధికారుల పిల్లలకు ప్రత్యేక సీట్లు ఉన్నాయని శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. మైనింగ్‌లో, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్(ఏఐ, మిషన్ లెర్నింగ్)లో మూడు చొప్పున సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం 18 సీట్లు కంపెనీకి రిజర్వ్ చేశారని వివరించారు. విద్యార్థులు 2025–26 టీజీ ఈఏపీసెట్‌లో అర్హత సాధించాలని, మార్కులు, ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారని తెలిపారు. దరఖాస్తులను జూన్ 14లోగా జీఎం, హెచ్‌ఆర్డీకి సమర్పించాల్సి ఉందని, వివరాలకు జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్‌లో సంప్రదించాలని సూచించారు.

'ఇబ్బంది పెట్టడం సరికాదు'

కాసిపేట: ఏళ్లుగా తమను ఇబ్బంది పెట్టడం సరికాదని దుబ్బగూడెం నిర్వాసిత గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం గ్రామంలో వారు సమావేశమయ్యారు. సింగరేణి కేకే ఓసీలో నిర్వాసిత గ్రామమైన దుబ్బగూడెం నిర్వాసిత ప్రజలకు రావల్సిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ డబ్బులు ఖాతాల్లో జమ చేయకుండా బెల్లంపల్లి ఆర్డీవో జాప్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. కలెక్టర్ వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



కొండపూర్‌లో తనిఖీ చేస్తున్న డీఏవో కల్పన

కాసిపేట: రైతులకు ఎరువులు, విత్తనాలు ఎంఆర్‌పీకే అమ్మాలని, రశీదులు ఇవ్వాలని డీఏవో కల్పన సూచించారు. గురువారం మండలంలోని ముత్యంపల్లి, కొండపూర్‌లో ఫర్టిలైజర్ షాపులను తనిఖీచేశారు. డీలర్లు ఎరువులు ఈ–పాస్ మిషన్ ద్వారానే విక్రయించాలని, విత్తనాలు, ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు.నిబంధనలు పాటించకపోయినా, నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏవో ప్రభాకర్ ఉన్నారు.